కథానిక

# రెండవ భార్య

"పరంధామయ్య"

స్టేషనులో రైలాగటంతోటే వీర్రాజు దిగాడు. పెట్టెలోంచి సామాను దించి— తన వధువు సుమిత్రను దించే వుద్దేశంతో దిగబోయే ఆమె చేతిని అందుకోబోయాడు. తాను సామాను వంటిది ఏమాత్రం కాదని ఋజువుచేస్తూ అతని సహాయం అందుకోకుండానే ఆమె రైలు దిగింది. వీర్రాజు ప్లాట్‌ఫారం నలువైపులా కలయజూసి సామాను తీసుకు పోయేందుకు నౌకరుకోసం వెతికాడు. టిక్కెట్టు కలెక్టరు వాడిని గేటుదాటి రానీ లేదు. వాడు తన అసహాయతను చూపిస్తూ దేబిరి మొహంతో తన యజమాని వైపు చూశాడు. వీర్రాజుకు మండిపోయింది. అతని ముక్కు పుటాలు అదిరినై—"రవ్వంత వాడిని రానిస్తే వీడి తాతదేం పోయిందో" గొణుక్కున్నాడు. ఎండ చుర్రుమంటోంది. అతని అర్థాంగి మౌనవ్రతం అవలంబించి నేలవైపు చూస్తూ ఎంత కష్టాన్నైనా సహించగల ధీమా తనలో వుందని తెలియజేస్తూ వుంది. "ఆ నీడ కన్నా పోరాదు- రేపటెండ"- ట్రంకుపెట్టెల రక్షణకు తానక్కడ వుండక తప్పదన్నట్లు మాట్లాడాడు. భార్య అతని సలహాను పాటించక పోగా కనీసం విన్నట్టయినా నటించలేదు. ఎంత నిర్లక్ష్యం. వీర్రాజు వుగ్రుడై తనకోపాన్ని నౌకరు మీదికి మళ్ళించి వాణ్ణి తిట్టడంతో తన కోపభారాన్ని కొంత తగ్గించుకొన్నాడు. ఇంతలో అతనికి టిక్కెట్లు చూసి పెట్టుకోవాలనే విషయం జ్ఞప్తికి వచ్చింది. జేబులో వెతికి అవి వున్నవని నిర్ధారణ చేసుకున్నాడు. తర్వాత కార్యక్రమం—సామాన్లు ఎన్ని వురువులు బండి కెక్కించింది, ఎన్ని దించింది లెక్క వేసుకున్నాడు. చెప్పులు గొడుగుతో సహా సరి పోయింది. పర్సు బైటికి లాగిచూచి అన్నీ సక్రమంగా వున్నందుకు తృప్తిపడి, సుమిత్ర వైపు చూశాడు. ఆమె ముఖం ఎండకు కంది నల్లబడ్డది. చెదిరిన ముంగురులు ఫాలభాగంపై పడి చెమటకు అతుక్కొని ఆమె అందమైన ముఖాన్ని వికారంచేసినై ఆమె చూపుల్లోని దీనత్వం వీర్రాజుకు జాలికలిగించింది. పెట్టెలు చెట్టుకిందకన్నా చేరుస్తామా అనుకున్నాడు. కాని తన దర్జాతో సుమిత్రను హడలగొట్టించి, తద్వారా ఆమెకు అత్యాశ్చర్యాన్ని కలిగించాలనీ, అప్పుడే ఆమె తనయొక్క ఘనతను అంచనా వేసుకోగలదని, దానితో ఆమెకు తన మీదవుండే వుదాశీనత్వం పటాపంచలు కాగలదని అనుకున్నాడు. అందుకనే అతడు నాలుగు రోజుల క్రిందట తాను అత్తగారింటికి వెళ్ళేప్పుడు బండి వచ్చే వేళకు గంట ముందుగా స్టేషనుకు వచ్చివుండమని నౌకరువాడితో కనీసం పదిసార్లయినా చెప్పివుంటాడు. వాడుమాత్రం వచ్చి యేం ప్రయోజనం? టిక్కెటు కలక్టరు వాణ్ణిరానీకపోయేసే తానిక్కడనిప్పులు చెరిగే ఎండలో పెట్టెలు ముందరేసుకొని, తలలోంచి సెలయేళ్ళ మాదిరి కారే చెమటను తుడుచుకుంటూ ఇంతకూ సుమిత్ర యేమనుకుంటుందో. తన్ను అసమర్థుడి కింద ఎక్కడ జమకడుతుందో. చెట్టుకిందకు పొమ్మన్నా పోదేం? తను పోతే గాని రాదేమో. ఈ పెట్టె లిక్కడుంచి పోతే? అతని గుండె గబుక్కుమంది. విధి వైపరీత్యం. వీర్రాజు భారమైన ఆ ట్రంకుపెట్టెలను చెట్టు కిందకు చేర్చాడు. ఆఖరి పెట్టెతో సుమిత్ర కూడా వచ్చింది. క్రమంగా ప్లాటుఫారం మీద జనం పల్చబడ్డారు. బండి కూడా కదలటానికి కేకేసింది. అప్పుడొచ్చాడు తన నౌకరు. వీర్రాజు వాడి నెత్తికి సామానెత్తి- గేట్లో టిక్కెట్లిచ్చి సుమిత్రతో బైటకొచ్చేశాడు.

"బండి కట్టుకరాలేదేం?"

"మనిషి లేక ఇరుసు కోయించ లేదు. అందుకని తలమనిషి నన్నొక్కణ్ణే పంపాడు. బాడిగబండి కట్టుకొని వస్తారులే అన్నాడు."

"ఏడ్చాడు. ఇన్ని రోజులనుంచీ యిరసు గాయక రేమి అఘోరిస్తో వున్నాడంట."

"మొన్న తగాదా పడ్డప్పటినుండి. సేద్యగాళ్లు రాలేదండి పనికి."

"ఏం తగాదారో?"

"తలమునిషి పెనుగొండడి పొలం దున్నటానికి సేద్యగాళ్ళని పొమ్మంటే పోలేదు."

"ఎందుకని?"

"మీరేమో పెనుగొండడికి చేసికోమని నాలుగేళ్ళనాడు యిచ్చారంట. మోనెడు కూలి తీసుకోకుండా వాడు ఖామందులోరికి రాత్రింబగళ్లు చాకిరీ చేశాడంట. ఆ చేను మళ్ళీ పెరుక్కోటం అన్యాయమని మేం దున్నమని అన్నారంటండి."

"ఆ, అంతవరకొచ్చిందీ. సరే, అటుబోయి బండి చూడోయ్. ఆరే యింతకు బండ్లు లేనట్టుందే."

"ఏయ్ బండీ, ఊరికొస్తావ్?"

"లేదండి నేనిప్పుడే నాలుగుమైళ్ళు పొయ్యొచ్చాను."

"ఆ బండి రాదూ?"

"ఏమో కనుక్కోండి."

"ఓ సాయిబో! యిటు రావయ్యా"

గుర్రానికి గడ్డిపోచలు అందిస్తున్న ఆ సాయిబు తలెత్తి "బండి కావాల్సంటే వస్తానండి."

"ఎంత బాడిగ?"

"మీకు తెలియనిదేంది- మారాజులు."

"ఎంతో చెప్పరాదూ వేధించక."

"మామూలే గదా అయ్యా."

"అట్లగాదు చెప్పవయ్యా, సంపుతున్నావు."

"అయ్యగారికి నేను చెప్పాలా - ఏదో మీ దయ."

"ఇంత బాడిగ అని చెప్పవయ్యా, తరువాత పేచీ పెట్టటానికా."

"సరే మీ యిష్టం. మామూలు బాడిగ రెండు రూపాయలు. తర్వాత మీ దయ."

"దయాలేదు ధర్మంలేదు. ఆ సామాను బండిలో పెట్టరా. కానీవయ్యా సాయిబూ."

"కానిస్తాను గాని—వక మనివి."

"ఏమిటోయ్? కానీ."

"కాసేపుంటే పిల్ల మెతుకులు తెస్తది. తినిపోతే ఎల్లిపోద్ది. పిల్లొచ్చిందాకా ఆలశ్యమనుకుంటే యిప్పుడే కదతాను. అయ్యగారింట్లో రెండు మెతుకులు వేయించండి."

వీర్రాజు అసలే చికాగ్గావున్నాడు. అడుగడుక్కీ లేనిపోని పేచీలు. అనవసరమైన రద్దీ అంతా కాళ్ళకు చుట్టుకున్నట్టు అతనికి తోచింది. కొంచెంసేపు ఆగిపోదామా అంటే ఆకలి అప్పుడే వేస్తోంది తానొక్కడే అయితే పర్వాలేదు. సుమిత్ర ఉంది. కొన్ని త్యాగాలు చేయటం అతనికి తప్పనిసరి అయింది. ఇంట్లో తిండి వుంటే వెయ్యటం ఏమంత కష్టమయిన పనిగాదు. తిండి లేకపోతే వండి అయినా వెయ్యాల్సివుంటుంది. తిండిలేదుపోండిరా అంటే పీనిగల మాదిరి స్పృహ తప్పినట్లు నటిస్తారే గాని, కొంపనుండి కదలరు. సరే, ఏమయినా ఇక ఎంతమాత్రం ఆలస్యం సహించటం దుర్భరమని అతనికి తోచింది.

"ఉంటే అలాగే పెట్టిస్తా లేవోయ్."

"నే తినే రెండు మెతుకులు సంస్థానంలో లేకుండా పోతాయా!"

హేయ్ అంటూ గుర్రాన్ని వెనక్కి అదలించి నాలుగు పోగులుగడ్డి పడివుంటే దాన్ని జవిరి చాపకింద వేశాడు.

"ఎక్కండి అమ్మగారు. యెనక అయ్యగారు కూసుంటారు, యీ ముసలోడు ముందు కూసుంటాడు."

సామాను—వీర్రాజు సుమిత్రలతో బండి భర్తీ అయింది. "బండి కదిలిస్తాను. మనిద్దరం ముందెక్కదాంలే—" అని కూలివాడితో అని "హేయ్-చలో-చలో బేటా-" అంటూ కొరడాతో నాజూగ్గా అంటించాడు.

గుర్రం బండిని ముందుకు వెనక్కు వూపి తల పైకీ కిందకీ ఆడిస్తూ పోవటం యిష్టంలేదనట్టు తెలియజేసింది.

"అహో—" బండిమనిషి గుర్రం కళ్ళాలు పట్టుకొని ముందుకు లాగుతూ కొరడాతో రెండు అంటించాడు. గుర్రం వెనక కాళ్ళను లేపి ఒక చిన్న ఎగురు ఎగిరి తనకూ చురుకు వున్నదని తెలిపింది. "అవ్ బేటా-అవ్-" గుర్రాన్ని బుజ్జగిస్తూ బండివాడు దాన్ని రెండడుగులు ముందుకు నడిపాడు. తర్వాత వెనక్కివచ్చి-"చలో బేటా

తలో" అంటూ బండి ఎక్కబోయాడు. కాని గుర్రం టక్కున ఆగిపోయింది.

"ఏం సాయిబూ గుర్రం తిప్పలు పెట్టేట్టు వుందే."

"కదిలేప్పుడు కొంచెం దొంగలెండి."

"గుర్రం ముసల్దిగా వుందే-యింకా దొంగయితే—"

"ముసిల్దీ? చాలా పసిదండి-మాకు తిండికి లేకపోతే దీన్కికూడా యెండగ. దాంతో పడుచుగుర్రంకూడా ముసిల్ది అయిపోద్ది" మేత లేక బక్కచిక్కింది అయ్యా-"

"పాపం-వళ్లంతా పుళ్ళే-" బండివద్ద తమాషా చూడటానికి మూగినవాళ్ళలో ఒకడన్నాడు.

"సామాన్కి తడపలు కట్టాను. అవితోలు రాసుకొని గాయాలయినాలెండి — చెల్-చెలో జేటా."

గుర్రం తల ఆడించి విధిలేనట్టు ముందుకు తూలింది. సామాను జరజరమనగా-బండి కిరకిరమనటం తప్ప చక్రం మాత్రం ఒక అంగుళంకూడా ముందుకు జరగలేదు. ఇంతలో గుర్రం వీపు మీద చర్రుమని కొరడాదెబ్బ పడింది. వెనక కాళ్లెత్తి ఒక్క యెగురు యెగిరి ముందుకు భారంగా అడుగేసింది గుర్రం. కొరడా పైన ఆడుతుండగా గుర్రంతూలుతూ ముందుకు పోవ సాగింది. కొరడా దెబ్బ పడ్డప్పుడల్లా—గుర్రం ముందుకు వూపేయడం—బండిలోని వారుకూడా ఆ వూపుకు ముందుకువాలటం-యింతలో గుర్రం వూపు తగ్గగా—బండిలోని మనుషులు కూడా యథాప్రకారం వెనకవూపు భరించటం, అడుగడుక్కూ యీ ముందు వెనకల వూపులకి వూగలేక బండిలోని వాళ్లు నానాహైరానా పడుతున్నారు.

గతుకులరోడ్డు అడుగడుక్కూ వూపేసిలాగే గుర్రం. దానికోరకు బండిమనిషి కర్ణకఠోరంగా విధివిరామం లేకుండా గుర్రాన్ని అదిలించేందుకు అరవటం — వీర్రాజు తల అశాంతితో మండిపోయింది. సుమిత్ర యిప్పుడేమనుకుంటుందో. తన్ను గడ్డిపరచకిందజమకడుతుందేమో. అసలే అహంభావం మనిషి. దానికితోడు యీ రోజు పరిస్థితులన్నీ తన్ను గాడిదను జేసి యేడిపించినై. ఇవన్నీ చాలక పెనుగొండడి భూమి తగాదా. రావడో పెనుగొండ యేడిస్తే సేద్యగాళ్ళు పనికి రాకపోవటం-ఛా—ఛా అంతా మహారద్దీగావుంది. ఏదో పేదింటిపిల్లని అణకువతో వుంటుందని చేసుకుంటే-యెంతదగా? పార్వతి అతివాగుడుతో కంగారెత్తిస్తే—సుమిత్ర అతినిర్లక్ష్యంతో కుంగదీస్తోంది. ఏమిటీ గ్రహచారం? ఈ పెనుగొండడి వ్యవహారంకూడా సుమిత్ర వినకుండా పరిష్కారం చేసుకోవాలి. లేకపోతే తను కోసిన కోతలకు పీడుత్త కోతలరాయుడురా అని సుమిత్రఅనుకుంటంటే ఇంకేమన్నా వుందా-ఛీ—ఛీ అన్నీ అట్లనే అధ్వాన్నంగా విడుస్తున్నై. ఏమిటీ గ్రహచారం. నిట్టూర్పు విడిచాడు వీర్రాజు.

వీర్రాజు మొదటి భార్య పార్వతి. పార్వతి సుమిత్రవలె కాదు. ఎప్పుడూ నవ్వుతూ సరదాగా మాట్లాడుతూ వుండేది. అప్పుడప్పుడు ఆమె వెకిలితనం వీర్రాజుకు వెగటుకూడా కలిగించేది. ఇక యింట్లోవుండే పెద్దవారి విషయం చెప్ప నక్కరలేదు. గుసగుసలతో పార్వతిని ఆడిపోసుకుంటూ సూటిపోటి మాటలతో ఆమెను నొప్పించేవారు. గదులని చెప్పకొనే ఆ చీకటి కలుగుల్లో— వూపిరి సలుపకున్నా-గొప్పవంశపు మత్తులో తృప్తిగా జీవిస్తూ-మెడ క్రుంగదీసే నగలతో భారంగా కదుల్తూ మూగజీవాలవలె కాలంగడిపే వీర్రాజు కుటుంబంలోని నారీమణులకు పార్వతిని ఎందుకు ద్వేషించాల్సి వచ్చిందో వారికే తెలియదు. మొదట యీ అనుభవం పార్వతికి కొంత ఆశ్చర్యం కలిగించినా వీర్రాజు రెండుమూడు సార్లు కసురుకోటంతో, తానొక జోనులో ఖైదీగా వున్నట్లు పార్వతి త్వరలోనే గ్రహించింది అంతే-మూడు రోజులు గది తలుపులు బిగించుకొని నిద్రాహారాలుమాని తన దుస్థితిని గురించి విచారిస్తూ గడిపింది. బహుశా ఏడ్చిందేమో. అప్పటినుండి చనిపోయేవరకు పార్వతి పెదవులపై చిరునవ్వు తళుక్కుమనగా ఎవ్వరూ చూడలేదు. నలుగురితో నారాయణాయన్నట్టు ఆయింటిలో యితరులవలెనే తానూ ఒక నీడలా కాలక్షేపంజేస్తూ వచ్చింది.

బండి రోడ్డుమలుపు తిరగటంతో పడమటి గాలి యెగురైంది. భోరుమని రొదజేస్తూ రోడు

మీది దుమ్ముని ఎగురగొట్టి కళ్ళు తెరనీకుండా చేస్తుంది గాలి. బక్కగుర్రం గాలితో పుకి నిలవలేక సాయిబు బాదినపుడల్లా గాడిదెగిరినట్టు యెగురుతుందేగాని ముందడుగు వేయలేకపోయింది. ఇక అరచి బాదలేక సాయిబు వోపికకూడా తగ్గిపోయింది. వీర్రాజుకు మనసు బేజారై ఈ బండిలో వూరికి చేరటం యెలా సాధ్యమో అనుమానం యేర్పడ్డది. సాయిబు బండిదిగి గుర్రం కళ్ళాలను పట్టుకొని మెల్లగా నడిపించసాగాడు. ఇంతలో ఒక బాడిగ గుర్రపు బండి ఎదురైంది.

"ఏంబాబూ యీ గుర్రం పోయేట్టులేదు. ఆ వచ్చేబండిని మాట్లాడమంటూరా."

"అది రాకపోతే—"

"ఈమాదిరే అవస్థపడుతూ పోదాం."

"సరే మాట్లాడు" ఇంతలో బండి దగ్గర కొచ్చింది.

"ఏయ్-బండి; వెనక్కుతిప్పు బాడిగుంది."

"తిప్పుతాగాని - బాడిగ రెండురూపాయలివ్వాలి"

"స్టేషనుదగ్గరనుండి సరే-మరి యిక్కడనుండీ అంతేనా—"

"మీకు సమాధానంగా వుంటే ఎక్కండి-లేకుంటే మీయిష్టం-చలో—" అంటూ బండివాడు బెట్టుచేశాడు.

"సరే. అలాగే యిస్తాం—" అంటూ వీర్రాజు దిగాడు. బండిలో సామాను పెట్టగా సుమిత్ర ఎక్కింది. వీర్రాజు ఎక్కి పోనీమన్నాడు.

"అరె. మై కిరాయాపూఁచ్ కే—" మొదటి బండివాడు రెండోవాడితో...

"వాడిక్క బాడిగ అడగతాడయ్యా."

"ఏం బాడిగ—ఒళ్ళంతా పచ్చానామైంది. నీకూఇచ్చి-వాడికీయిచ్చిబోర్లించుకోవాల్సిందే"

"ఏదో-గరీబ్‌ని-దయపెట్టండి-పిల్లలు తిండికి ఏడుస్తుంటూరు."

"ఎక్కడబట్టినా పిల్లలు-పిల్లలు ఏడుస్తారని మమ్మల్ని పీక్కుతినటం."

"ఏదో పేదవాడు లెండి. ఒకరూపాయ డబ్బులు పారెయ్యండి."

"రూపాయే—"

"నే నక్కడేవుంటే మూడు రూపాయలకి తక్కువ వచ్చేవాడినా - వాడిది బక్కగుర్రం గనక—"

"సరే బాగా శరిపోయారు-యిదిగోనోయ్ సాయబూ-డబ్బిస్తేగాని పీడ వదలదట—" రూపాయ యిచ్చాడు. "ఇక పోనీవయ్యా—" వీర్రాజు రూపాయి వదలిందానికి మహా కష్టపడ్డాడు. సుమిత్ర తను లుబ్ధుడని యెక్కడ భావిస్తుందో అని విధిలేక రూపాయి యిచ్చాడు. వృధాగా మూడురూపాయ లయిందే-యిరుసు కాసివుంటే యీ దండగ లేదుగదా. వెధవ పెన్గొండకు-ఇంకొక సమయంలో అయితే వాణ్ణి సేద్యగాళ్ళను ఏదో ఒకటి చేసేవాడే. కాని యిప్పు డెంతమాత్రం రద్దీ పనికిరాదు. సుమిత్ర యింకా కొంతకాలం తానీవూళ్ళో ఘరానామనిషినని అనుకుంటూ వుండాలి. లేకపోతే తన్ను చులకనగా చూసిందన్న మాటే, వీర్రాజు తల ఈ వూహలతో యింటి కొచ్చిందాకా నిండిపోయింది.

వాకిట బండి దిగడంతోటి పంచలో కూర్చొని కునికిపాట్లు పడే తలమనిషి నర్సయ్య కనపడ్డాడు వీర్రాజుకు. సామాను భద్రంగా యింట్లో పెట్టమని నౌకరుతో చెప్పి సుమిత్రతో యింట్లోకి వెళ్ళాడు వీర్రాజు. నర్సయ్యమాత్రం వీర్రాజు యెప్పుడు ఇంట్లోనుంచి బైటికొస్తాడా అని కనిపెట్టుకు కూర్చున్నాడు. ఇంతలో వీర్రాజు రాక విని సేద్యగాళ్లుకూడా వచ్చారు. పొద్దు తిరిగింది. కడుపులో మండుతున్నా వీర్రాజుతో వైనం మాట్లాడిపోదామని నర్సయ్య అలాగే కూర్చున్నాడు. ఇంతలో నర్సయ్యకు పిలుపు వచ్చింది అతడు లేచి ఆవులిస్తూ లోపలికెళ్ళాడు. వీర్రాజు మంచంమీద పండుకొని చుట్ట తాగుతున్నాడు. నర్సయ్య రాగానే స్టూలుపై కూర్చోమని చెప్పాడు.

"సేద్యగాళ్లు దున్నటానికి పోనన్నారట నే! మంచోళ్ళను చూచి కుదిర్చావు. వాళ్ళతో ఎవడు యేడాటంపడతాడు."

"సేద్యగాళ్లు మంచోళ్ళే. కాలం అట్లా చేస్తుంది వాళ్ళని"

"సరే ఇదిరద్దీలేకుండ పొయ్యేవుపాయం?"

"ఖామందులోరికి నే జెప్పేమాట కొంత

వరకైనా మనసు నొచ్చింటుంది. దాని తస్సాదియ్యా! కాలం గిరికీలుకొట్టా మారిపోయింది. కాలంతోటి మారలేక మనం నానా అవస్థపడుతుండాం. ఆ పెనుగొండడి గోష్ట చెపితే అలవిగాకుండావుంది. వాడు ఊరంతా తిరిగి తన్నేదో మనం ముంచినట్టు యేడుస్తా చెప్పుకుంటుండాడు. దానికితోడు సంఘంవాళ్లు మీటింగులు పెట్టి ఏమేమో వాగుతూ నానా గలభా జేస్తుండారు. సేద్యగాళ్లు ఎదురు తిరిగారంటే వాళ్ల మొహం వాళ్ళకంత ధీమా ఎక్కడ నుంచొచ్చింది? ఇదేదో కుంభకోణం. ఇప్పుడేమాత్రం రెచ్చగొట్టకుండా మనమాటు తగ్గినటుగాకుండా సరిజేస్తే అవతల సమయం జూచి నాయాళ్లని వొక వూపు వూపుదాం. వెధవనాయాల్లిది డబ్బై సెంట్ల పొరంబోకు కోసం ప్రతివాడి నోట్లో నానడమెందుకు? ఆ పెనుగొండడు అట్టుండాడేగాని వాడి ఆగాయిత్యం జూస్తే యీ పీడ పోతేచాలు ననిపిస్తుంది. ఏదో యీ రద్దీ అంతా నామీద పెట్టి ఆ పెనుగొండడితో "నీడే పోరా పొలం" అనండి—సమయం జూచి యెదురు తిరిగినోళ్ళకు తగినపని జేస్తాం-ఏమంటారు?"

"సరే నర్సయ్యా నీ ఐన్నట్టు కాలం మారింది-నిజమే. తెగిందాకా లాగితే అసలుకే మోసం రావచ్చు. నే నలాగే చెప్పానని వాళ్ళను పంపు. బండి లేకపోయేటప్పటికి నానా యాతనా పడ్డా. ఈ రోజన్నా కొయించవయ్యా బండి యిరుసు."

"సరే కొలిందగ్గరకు పంపుతా—నే వస్తా అయితే..."

"సాయింత్రం కనబడు" నర్సయ్య పోయినాడు. తల మనిషి కూడా రద్దీలేకుండా పోతే బాగుండును అని చెప్పినాడు కాబట్టి వీర్రాజుకు కొంచెం తృప్తి కలిగింది.

రాత్రి పొద్దు పోయినాక సుమిత్రకోసం యెదురుచూస్తూ మిద్దెమీది గదిలో కూర్చొని వున్నాడు వీర్రాజు. దూరాన నక్కలు అరుస్తున్నాయి. వీధి వాకిట్లో జీతగాళ్లు కబుర్లు చెప్పుకొని నవ్వుకుంటున్నారు. వీర్రాజుకు నర్సయ్య చెప్పిన మాటలు జ్ఞాపకానికి వచ్చినయ్.

"కాలం మారిందని నర్సయ్య అన్నాడు. నిజమే. లేకుంటే యీ కూలోళ్ళకు యీ తలబిరుసు యింతకు ముందెప్పుడైనా వుందా? సుమిత్రవద్ద ఎన్నో కోతలు కోశాను. మా ఊళ్లో నాకు తిరుగులేదు అన్నాను. అంతేగాదు నా మాటంటే మా వూళ్ళో అందరికీ హడల్ అని కూడా చెప్పాను.

"కాని ఈరోజు జరిగిందేమిటి. నా సొమ్ము తిని సేద్యగాళ్ళే యెదురు తిరిగారు. ఇదే సుమిత్రకు తెలిస్తే? అబ్బో - పరువుపోదూ అందుకనే లొంగిపోయాను. ఈ రభస అంతా సుమిత్రకు తెలుస్తుందని భయపడి వెధవ పెనుగొండకి మాణిక్యమంటి చేను ధారపోయ్యాల్సి వచ్చింది. సుమిత్రకోసం యిది మరో త్యాగం. ఇంతకూ దానికి నేనంటే వుండే నిర్లక్ష్యం ఎందుకో తెలుసుకోవాలి. నేనంటే యిష్టంలేదు...ఆల్ రైట్ వెళ్ళమందాం...యెందుకీ ముసుగులో గుద్దులాట..."వీర్రాజు అలసిపోయి ఒకలోటా మంచినీళ్లు త్రాగి లోటా చెంబుదగ్గర పెడుతుండగా సుమిత్ర వచ్చింది.

"రా-కూర్చో-నీతో కొంచెం మాట్లాడాలి"

సుమిత్ర చికాకుపడుతూ అలాగే నిలబడింది.

"లోపలికి రావా యేం"సుమిత్ర లోపలికి రాగా వీర్రాజు తలుపేశాడు. పడమర మబ్బు వేసిందేమో వున్నట్టుండి హోరుమని గాలి వీచ సాగింది.

"ఎందుకట్లా ముభావంగా వుంటావ్, నేనంటే యిష్టంలేదూ?"

సుమిత్ర తలయెత్తి అతని మొహంవైపు చూసింది. ముఖం చేతులతో కప్పుకొని ఏడవ సాగింది.

"ఇదేం ఘోరంరాబాబూ-కొని తెచ్చుకున్నట్టుందే..."వీర్రాజు తికమకపడ్డాడు.

"అబ్బే ఏడవబాక—ఎందుకూ? ఇంతకూ నే నేమన్నాను. అలా దిగులుగా వుంటే ఎందుకు అని అడుగుతున్నా—అంతే"

"మా అమ్మ అట్టనే వుండమని చెప్పింది"

"ఎందుకని..."

"మీయింట్లో అందరూ ఈమాదిరే వుంటారట. ఇక్కడకువచ్చి చూస్తే మా అమ్మ చెప్పినట్టే వుంది."

"ఇక్కడేం చూశావ్"

"అందరు గప్‌చిప్‌గా వుంటారు-మాట్లాడరు-నవ్వరు-వూపిరి కూడా గట్టిగా పీల్చరు. నాకేమో ఈయిల్లు చూస్తే భయం పుడుతోంది"

"వుశ్ పిచ్చిదానా! అదా సంగతి మీ అమ్మ భయపెట్టింది గదూ — అందుకేగా యీ యిల్లు గట్టింది. అక్కడ సరే-యిక్కడమాత్రం నవ్వుతూవుండు... ఏం, నేనుండగా నీకేంభయం?"

"ఆ యిల్లు తలుచుకుంటేనే భయం—" ఏడవబోయింది.

"అబ్బె ఏడవబాకు-అనవసరంగా భయపడ్డావు."

"ఆ యిల్లు తలుచుకుంటే వున్నట్టుండి గుండెల్లో గుబుక్కుమంటుంది. నేనిక ఆ యింట్లోకే పోను. ఆ యింట్లో, చీకట్లో, మనుషులు కదులుతుంటే దయ్యాలు తిరిగినట్లుంది."

వీర్రాజుకు గుండె ఆగిపోయినట్లయింది. సుమిత్ర మీద్దే దిగదూ-లోకు లేమనుకుంటారు? మొదటి పెళ్ళాన్ని అష్టకష్టాలు పెట్టి రెండో పెళ్ళాన్ని మిద్దె యెక్కించాననా? ముసలోళ్ళేమనుకుంటారు? ఏదో అనుకుంటారు. సహించాలి. సుమిత్రకోసం యిదొక త్యాగమా-సరే అలాగే అంటూ లేని చిరునవ్వును పెదవులపైకి తెచ్చుకొని సుమిత్రవైపు చేతులు చాచాడు వీర్రాజు.

# "కన్యాశుల్కం" సినిమా: కొన్ని సలహాలు

ఈరంకి వెంకటరావు

మహాకవి గురజాడ అప్పారావు పంతులుగారు రచించిన కన్యాశుల్కం నాటకాన్ని చలనచిత్రంగా తీస్తామని రెండు ఫిలిం సంస్థలు ప్రకటించాయి. కన్యాశుల్కం సినిమాగా తియ్యాలనేది ఆంధ్రుల చిరకాలవాంఛ. ఐతే ఆంధ్ర రాష్ట్రవాంఛకు మల్లేనే యీ విషయంలోగూడా వ్యతిరేకులు లేకపోలేదు. ఈ వ్యతిరేకుల భయమేమంటే కన్యాశుల్కం నాటకం పుస్తకరూపంలో నేవుంటే పఠితలకుచక్కని హాస్యాన్ని, వినోదాన్ని, విజ్ఞానాన్ని యివ్వగలదనీ, సినిమా తీసినట్టయితే అసమర్థుల చేతిలో పడిగాని, ఎడిటింగు చేతకాక గాని కన్యాశుల్కంలోని మాధుర్యమంతా చచ్చిపోతుందని. ఈ భయంకూడా సమంజసమైనదే, కాని చదువు వచ్చినవారే కన్యాశుల్కంలోని మాధుర్యాన్ని ఆస్వాదించగలరుగాని చదువు రానివాళ్లు ఎన్నాళ్ళని యీ మహాకావ్యంలోని మాధుర్యాన్ని కొంతలో కొంతైనా ఆస్వాదించక పోవటమనేది మరో ప్రశ్న.

అసలు విషయమేమంటే కన్యాశుల్కం నాటకమంతా తూ చ. తప్పకుండా నాటకరూపంలో ప్రదర్శించాలంటే ఒక్క రాత్రి చాలదు ఇంతవరకూ ఎవరు ఎన్ని ప్రదర్శనాలిచ్చినా అందులో హాస్యపూరితమైన భాగాలు తీసుకునే ప్రదర్శించారు. ఒకవేళ ఎక్కడైనా ఎవరైనా ప్రదర్శించి వుంటే చాలా భాగాలు తీసేసి నాటకాన్ని కుదింపించి వుండాలి. కన్యాశుల్కంలో తమాషా ఏమిటంటే ఏ భాగాలు తీసివెయ్యాలా అనే సందేహం కలిగేసరికి అన్ని భాగాలు ముఖ్యంగానే కనబడుతాయి. కథాభాగంతో అట్టే సంబంధంలేని ఏ పేకాట సీను తీసివేసినా అందులో మాధుర్యం లోపిస్తుంది. అందుకనే యీ నాటకం ఎంత రసవత్తరమైనా ఏ నాటకం కంపెనీవాడూ దీన్ని ఆంధ్రదేశంలో నలుమూలలా ప్రదర్శించలేదు.

ఇంత పెద్ద నాటకం 17, 18 వేల అడుగుల పిక్చర్లు తీసే రోజుల్లో స్వంత పైత్యం ఏమీ లేకుండా చక్కగా—చలన చిత్రంగా చిత్రించవచ్చు. చలన చిత్రంగా తీయదలచుకున్నప్పటికీ యీ నాటకాన్ని కొంతమట్టుకు "ఎడిట్" చెయ్యవలసిన అవసరం వుంటుంది. ఈ చిత్రంలో పాటలు ఎక్కువగా పెట్టవలసిన అవసరం లేదు. రెండు, మూడు పాటలకంటె